క్లుప్తంగా

చంద్రశేఖరస్వామికి పూజలు


చంద్రేడు గ్రామంలోని చంద్రశేఖరస్వామి

రంగంపేట: చంద్రేడు గ్రామంలోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునే అభిషేకాలు జరిపారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం


శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ సీతారత్నం

బిక్కవోలు: తొస్సిపూడి గ్రామంలోని సచివాలయం వద్ద సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కొవ్వూరి సీతారత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు 56 మందికి పరీక్షలు చేసి, వారిలో ఆరుగురికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో కర్రి శ్రీనివాసరావు, గోవింద రెడ్డి, నందిని చారిటబుల్ ట్రస్ట్ అధినేత కొవ్వూరి వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వీరబాబు, పందలపాక మాజీ సొసైటీ అధ్యక్షుడు పడాల సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు వైద్యసేవలు


శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన భానుతేజ మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్, శ్రీరమా దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉద్యోగులకు దంత, కంటి పరీక్షలు, జనరల్ వ్యాధులకు వైద్యసేవలు అందించారు. పంచాయతీ రాజ్, ఎన్ఆర్ఈజీఎస్ తదితర పలు శాఖల ఉద్యోగులు వైద్య సేవలు పొందారు. శిబిరాన్ని ముందుగా ఎంపీడీవో భారతి ప్రారంభించారు.

సమస్యలపై నాలుగు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాలుగు అర్జీలను అందుకున్నామని ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థిని అదృశ్యం

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన 22 ఏళ్ల యువతి అదృశ్యమైంది. ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రామ్ కుమార్ కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరంలోని కళాశాలలో బీటెక్ చదువుతున్న ఆమె సోమవారం ఉదయం కళాశాలకు వెళ్లలేదు. అయితే మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అదృశ్యమైంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి పశు వైద్య శిబిరాలు

బిక్కవోలు/అనపర్తి: బిక్కవోలు, అనపర్తి మండలాల్లో మంగళవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకూ పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు అనపర్తి సహాయ సంచాలకులు డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. నట్టల నివారణ, సన్నజీవాల టీకాలు, వ్యాధుల నిర్ధారణ, చికిత్స, సాధారణ ఆరోగ్య సమస్యలకు వైద్యసేవలు అందిస్తామన్నారు. బిక్కవోలు మండలానికి సంబంధించి మంగళవారం రంగాపురం, బుధవారం ఇలపల్లి, 23న తొస్సిపూడి, 24న ఊలపల్లి, 25న కొమరిపాలెం, 27న ఆరికరేవుల, 28న కాపవరం, 29న కొంకుదురు, 30న బలభద్రపురం, 31న మెల్లూరు గ్రామాల్లో జరుగుతాయన్నారు. అనపర్తి మండలానికి సంబంధించి మంగళవారం పీరా రామచంద్రపురం, బుధవారం దుప్పలపూడి, 23న కొప్పవరం, 24న లక్ష్మీనరసాపురం, 25న మహేంద్రవాడ, 27న రామవరం, 28న పెడపర్తి, 29న కుతుకులూరు, 30న పులగుర్త, 31న పాలమూరు గ్రామాల్లో శిబిరాలు జరుగుతాయన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: రైతు సేవా కేంద్రాల ద్వారా అన్నదాతలకు వివిధ సేవలు అందించడానికి గ్రామ వ్యవసాయ సహాయకులు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. జిల్లా గ్రామ వ్యవసాయ సహాయకుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం సాయంత్రం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వీఏఏ సంఘ అధ్యక్షుడు కె.దుర్గబాబు, ఉపాధ్యక్షులు తమ్మినాయుడు, డి.సురేష్, రాష్ట్ర ఏఈవో సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధవ్, జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం కార్యదర్శి కమల్ రాజు పాల్గొన్నారు.

పరీక్షలకు వేళాయె..

- మార్చి 1 నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు
- సిద్ధమవుతున్న విద్యార్థులు
- కళాశాలల్లో ప్రత్యేక తరగతులు
- నూరుశాతం ఉత్తీర్ణత సాధనకు అధ్యాపకుల కృషి


రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

రంగంపేట: విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియెట్ అనేది చాలా ముఖ్యమైన మెట్టు. దాన్ని సమర్థంగా అధిరోహిస్తే ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చు. ఇంటర్‌లో సాధించిన మార్కులే ఆ తర్వాత వివిధ కోర్సులకు బాటలు వేస్తాయి. ముఖ్యంగా ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులకు పునాదులు పడతాయి. ఇంటర్‌లో తర్వాత నిర్వహించే వివిధ పోటీ పరీక్షలను సునాయాసంగా రాయవచ్చు. ఈ నేపథ్యంలో అన్ని కళాశాలలు తమ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాయి. పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి శ్రద్ధ చూసుకుంటున్నాయి. పరీక్షల కోసం విద్యార్థులను సిద్ధం చేస్తున్నాయి.

పరీక్షలకు సన్నద్ధం

ఇంటర్మీడియట్ పరీక్షల సమయం ఆసన్నమైంది. మార్చి 1 నుంచి ప్రథమ, 3వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు థియరీ పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మరో నలభై రోజుల గడువు మాత్రమే మిగిలిఉంది. సమయం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని, ఈ విలువైన సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటే అనుకున్న మార్కులు సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు. జిల్లాలోని 19 మండలాల్లో గల ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. సిలబస్ పూర్తి కావడం, సమయం తక్కువగా ఉండడంతో అతి ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై సబ్జెక్టు నిపుణులు సూచనలు చేశారు.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం



రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో 156, సెకండియర్‌లో 147 మంది విద్యార్థులు చదువుతున్నారు. సంకల్ప–2025లో భాగంగా నూరు శాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఉదయం అరగంట ముందుగా క్లాసులు ప్రారంభిస్తున్నాం. సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం కూడా అందిస్తున్నాం. మార్చి 1 నుంచి పరీక్షలు ప్రారంభం కానుండడంతో ఇప్పటికే సిలబస్ పూర్తి చేయడం జరిగింది. ప్రభుత్వం అందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులతో చదివిస్తున్నాం.

– బి.హేమ, ప్రిన్సిపాల్, రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

లాంగ్వేజ్ సబ్జెక్టుల మార్కులు కీలకం



మొత్తం మార్కుల్లో లాంగ్వేజ్ సబ్జెక్టుల మార్కులు కూడా సైతం కలుస్తాయి. తెలుగు, ఇంగ్లిషు సబ్జెక్టుల్లో గ్రామర్‌కు, ప్రశ్నా జవాబులకూ సమ ప్రాధాన్యం ఇవ్వాలి. మొదటి సంవత్సరంలో శ్మశాన వాటిక, నందీశ్వరుని శాపం, కపాలమోక్షం, అప్పుడే పుట్టి ఉంటే, గాన సుభాకరుడు మంగళంపల్లి, కందుకూరి, కుంకుడాకు, ఎచ్చరిక పాఠాలను, సెకండియర్‌లోని శాంతికాంక్ష, కర్మభూమిలో పూసిన ఓ పువ్వా, మన ఆటలు, వేమన కవిత్వంపై దృష్టి సారించాలి. పద్య, గద్య భాగాల్లో వ్యాసరూప, ఉపవాచకం నుంచి 4 మార్కులు, అన్నింటి నుంచి మూడు మార్కుల ప్రశ్నలొస్తాయి.

– పి.కృష్ణమూర్తి, తెలుగు అధ్యాపకుడు

పూర్తి మార్కులు పొందే అవకాశం



లెక్కల్లో అన్నింటికీ సమ ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా 75 మార్కులనూ పొందే అవకాశం ఉంది. మ్యాథ్స్–1ఏలో మాత్రికలు, ప్రమేయాలు, త్రికోణమితి, నిష్పత్తులు, పరివర్తనాలు, త్రిభుజ ధర్మాలు, సదిశల సంకలనం, సదిశల గుణకం, అతి పరావలయ ప్రమేయాలకు, 2ఏలో డీమూవర్స్ ధీరం, సంభావ్యత, యాదృశ్చిక చలరాశులు, ద్విపద సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– ఏడీవీ ప్రసాదరావు, మ్యాథ్స్ అధ్యాపకులు

వ్యాసరూప ప్రశ్నలపై శ్రద్ధ పెట్టాలి



ఫిజిక్స్ ప్రథమ సంవత్సరంలో డోలనాలు, ఉష్ణగతిక శాస్త్రం, పని–శక్తి, సామర్థ్యం, పదార్థ ఉష్ణ ధర్మాల నుంచి ఎనిమిది మార్కుల ప్రశ్నలు వస్తాయి. ద్వితీయ సంవత్సరంలో కేంద్రకాలు, తరంగాలు, ప్రవాహ విద్యుత్ పాఠ్యాంశాల నుంచి వ్యాసరూప ప్రశ్నలు, మిగిలిన వాటి నుంచి 2, 4 మార్కుల ప్రశ్నలు వస్తాయి.

– జి.శ్యామలరావు, ఫిజిక్స్ అధ్యాపకుడు

చిత్ర పటాలు విధిగా వేయాలి



బోటనీ ఫస్టియర్‌లో జీవ వైవిధ్యం, ప్రత్యుత్పత్తి విధానాలు, కణం నిర్మాణం, పుష్పించే మొక్కల్లో లైంగిక ప్రత్యుత్పత్తి, మొక్కల నిర్మాణాత్మక సంవిధానం – స్వరూప శాస్త్రాల నుంచి అధిక ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. బోటనీ సెకండియర్‌లో వృక్ష, శరీర ధర్మశాస్త్రం, జీవ సాంకేతిక శాస్త్రం, మానవ సంక్షేమంలో మొక్కలు, సూక్ష్మ జీవులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– వీబీ ఫ్లోరెన్స్, జువాలజీ అధ్యాపకురాలు

అన్నింటిపై దృష్టి సారించాలి



సివిక్స్ ప్రథమ సంవత్సరంలో రాజనీతి శాస్త్రం పరిధి స్వభావం, జాతి – జాతీయత, హక్కులు బాధ్యతలు, ప్రజాస్వామ్యం, ప్రభుత్వంపై దృష్టి సారించాలి. ద్వితీయ సంవత్సరంలో భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు – ఆదేశిక సూత్రాలు, కేంద్ర కార్యనిర్వాహక శాఖ, కేంద్ర శాసన నిర్మాణ శాఖ, భారతదేశంలో స్థానిక ప్రభుత్వాలు, ఏపీ, భారతదేశంలో ఇటీవల పరిణామాలపై దృష్టి సారించాలి.

– కేవీ కృష్ణ, సివిక్స్ అధ్యాపకుడు

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు


సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయం కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలోసిల్ట్‌ను ఎప్పటికప్పుడు తీయించాలని, పొడిగా ఉన్నప్పుడు ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించి దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలతో మందు పిచికారీ చేయాలన్నారు. యంత్రాలు లేని చోట మలాథియాన్, నువాను, బెటెక్స్, ఏబేట్, డీజిల్, ఫెనాయిల్ సమపాళ్లలో కలిపి కచ్చా మురుగు కాలువ వెంబడి రెండు పర్యాయాలు పిచికారీ చేయాలన్నారు. ఈ మందులు వినియోగించకపోతే మత్స్యశాఖ నుంచి గంబూషియా చేపలు తీసుకొని, డ్రైనేజీలో వదిలితే దోమ లార్వాలను అవి తినేస్తాయన్నారు. గ్రామాల్లో ప్రజలకు సురక్షితమైన తాగు నీరు సరఫరా చేయాలని, వాటర్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసి లాగ్ బుక్ నిర్వహించాలన్నారు. ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయడానికి కృషి చేయాలన్నారు.

నార్త్‌జోన్ డీఎస్పీగా శ్రీకాంత్



మధురపూడి: రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా డీఎస్పీగా ఎలిశెట్టి శ్రీకాంత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లాకు చెందిన ఆయన మొదటిసారిగా డీఎస్పీగా బదిలీపై వచ్చారు. ఆయనకు ఎయిర్‌పోర్టులో కోరుకొండ సీఐ సత్యకిషోర్, రాజానగరం సీఐ నారాయణ గౌడ్, ఎస్సై శ్యామ్‌సుందర్, ఎయిర్‌పోర్టు ఎస్సై ఎండీ అస్వక్ స్వాగతం పలికారు. అనంతరం కోరుకొండలోని డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మహిళల సంరక్షణ, అసాంఘిక కార్య కలాపాల నిర్మూలనకు చర్యలు చేపడతానన్నారు.

అఖిల భారత రైతు కూలీ సంఘం ధర్నా



ప్రజావేదిక వద్ద ఆందోళన చేస్తున్న రైతు కూలీలు

రాజానగరం: మండలంలోని నందరాడలో 20 ఏళ్లుగా సాగు చేస్తున్న సీలింగ్ భూములను విక్రయించాలనుకునే వారిపైనా, దానికి సహకరించిన వారిపైనా చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఇక్కడ జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కర వేదికలో కలెక్టర్‌కు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు ఫిర్యాదు చేశారు. సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారిని పోలీసులు అడ్డుకోవడంతో ఆందోళనకు దిగారు. కొద్దిసేపటికి లోపలకు పిలవడంతో తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఎన్నో పోరాటాలు చేసి ఈ భూములను 50 మంది నిరుపేదలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అలాగే రాజానగరం, సూర్యారావుపేటలో ప్రభుత్వం ఇచ్చిన స్థలాలో ఇళ్లు కట్టుకున్న వారికి విద్యుత్ సరఫరా ఇవ్వాలని కోరారు.

పోక్సో కేసులో రిమాండ్

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన బాలికను కిడ్నాప్ చేసిన పండలనేని దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. పదో తరగతి చదువుతున్న తన కుమార్తె ఈ నెల 17వ తేదీ తెల్లవారుజామున 4 గంటల నుంచి కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ కారులో తీసుకువెళుతుండగా కిర్లంపూడి వద్ద అరెస్టు చేశామన్నారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో జైలుకు తరలించామని ఎస్సై తెలిపారు.

సబ్బెళ్ల కృష్ణారెడ్డికి పలువురి పరామర్శ


సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాతృమూర్తి బాపాయమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

పెదపూడి: అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, రామవరం గ్రామ ఉప సర్పంచ్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాతృమూర్తి బాపాయమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని, కృష్ణారెడ్డి సోదరులు శ్రీనివాసరెడ్డి, వెంకటకృష్ణారెడ్డిలను పెదపూడి ఎంపీపీ కేతా తులసి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పలువురు ప్రముఖులు సోమవారం పరామర్శించారు. అలాగే అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల రమణ, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, బిక్కవోలు మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఉస్మాన్ బాషా, గంద్రేడు, వేంద్ర, పైన గ్రామాల సర్పంచులు, కుడిపూడి మాధవీలత, కోసూరి వాసు, సుందరపల్లి ప్రమీళ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పునాది అభ్యసనం ఎంతో కీలకం


మాట్లాడుతున్న ప్రాజెక్టు అడిషనల్ కో ఆర్డినేటర్ సుభాషిణి

రాజానగరం: ప్రాథమిక విద్యలో పునాది అభ్యసనం ఎంతో కీలకమని సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్టు అడిషనల్ కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అన్నారు. మండలంలోని కొండగుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఎఫ్ఎల్ఎన్ జ్ఞాన ప్రకాష్ సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి 8వ బ్యాచ్ శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థికి ప్రాథమిక స్థాయిలో చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక భావనలు తెలిసి ఉండాలన్నారు. జిల్లా నుంచి 275 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 80 ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరయ్యారన్నారు. ఈ విధంగా ఉమ్మడి జిల్లాలలో ఒకటవ తరగతి బోధించే ఉపాధ్యాయులందరికీ 14 బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తారు. కార్యక్రమంలో 24 మంది డీఆర్పీలు, ముగ్గురు కెఆర్పీలు, ఏఎంఓ డి.గౌరీశంకరరావు, కో ఆర్డినేటర్లు ఎస్.కనక బాబు, ఏస్తేరురాణి, ఎంఈఓలు జ్యోతిప్రసాద్, మధుసూదనరావు, జిల్లా కోఆర్డినేటర్ అనూష, పాల్గొన్నారు.

నరేంద్రబాబుకు విప్ర సేవాభూషణ అవార్డు


నరేంద్రబాబు చేతికి స్వర్ణ కంకణం అలంకరిస్తున్న ప్రముఖులు

సీతానగరం: ఆధ్యాత్మిక రంగంలో అందించిన విశిష్ట సేవలకు గాను ఇనుగంటివారిపేటకు చెందిన ఆరాధ్యుల నరేంద్రబాబుకు విప్ర సేవాభూషణ అవార్డు లభించింది. ఆర్యాణి సకల కళా వేదిక వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు డాక్టర్ దూడపాక శ్రీధర్ చేతుల మీదుగా కరీంనగర్‌లోని ఫిల్మ్ భవనంలో ఆదివారం అయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు చేతికి స్వర్ణ కంకణం అలంకరించి, ఘనంగా సన్మానించి, విప్ర సేవా భూషణ అవార్డును అందించారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో నరేంద్రబాబు విశిష్ట సేవలు అందించారని, విజయవాడ ముంపు బాధితులను ఆదుకున్నారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 67 మందికి పలు అవార్డులను ఇచ్చామని, తూర్పుగోదావరి జిల్లాలోని ఐదుగురిలో నరేంద్రబాబుకు విప్ర సేవ భూషణ అవార్డు అందించడం జరిగిందన్నారు.

ప్రేమంటూ మాటలు కలిపి.. పెళ్లయ్యాక నరకం చూపి..

- ఎస్టీ యువతికి వేధింపులు
- నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీకాంతం

కంబాలచెరువు: ప్రేమ పేరుతో తనను నమ్మించి, పెళ్లి చేసుకున్న తర్వాత చిత్రహింసలకు గురి చేయడంతో పాటు హత్యాయత్నం చేసిన జాన దివ్య శేఖర్‌ను కఠినంగా శిక్షించాలని ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన 24 ఏళ్ల లక్ష్మీకాంతం కోరింది. ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎ.మోహన్‌కుమార్‌తో కలిసి సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించింది. బాధితురాలి వివరాల ప్రకారం.. లక్ష్మీకాంతం భర్తతో వేరుపడి ఒంటరిగా కోలమూరులో జీవిస్తోంది. తన ఇంటి నిర్మాణం కోసం జాన దివ్యశేఖర్‌కు చెందిన ఎలక్ట్రికల్ షాపునకు సామాన్ల కొనుగోలు చేసేందుకు వెళ్లింది. అక్కడ ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. లక్ష్మీకాంతం, ఆమె కుమార్తెకు తోడు ఉంటానని నమ్మబలికి దివ్య శేఖర్ వివాహం చేసుకున్నాడు. అనంతరం ఆమె గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించాడు. అయితే అంతకు ముందే అతడికి వివాహమైంది. అలాగే లక్ష్మీకాంతం దగ్గర ఉన్న డబ్బుతో ఎలక్ట్రికల్ సామాగ్రి షాపు పెట్టించాడు. అనంతరం ఆమెను దూరంగా పెట్టడంతో పాటు ఆమె అనారోగ్యంతో షాపునకు వెళ్లని సమయంలో దానిలో సామగ్రిని వేరే చోటుకు తరలించాడు. ఈ విషయం ప్రశ్నించేందుకు దివ్యశేఖర్ షాపు వద్దకు వెళ్లిన లక్ష్మీకాంతాన్ని అతడితో పాటు, ఆయన భార్య, సోదరుడు, కుమారుడు కులం పేరుతో దూషించి, విచక్షణా రహితంగా కొట్టి, ఒంటిపై పెట్రోలు వేసి నిప్పంటించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించకుండా ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

బాధితురాలికి అన్యాయం

మోహన్ కుమార్ మాట్లాడుతూ కేసు విషయంలో బాధితురాలికి అన్యాయం జరిగిందన్నారు. నిందితులకు కొందరు అధికారులు కొమ్ముకాశారని ఆరోపించారు. ఈ విషయంపై గత సోమవారం ఎస్పీకి వినతిపత్రం అందించామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినప్పటికీ దర్యాప్తు సక్రమంగా జరగడం లేదన్నారు. బాధితురాలికి ప్రాణహాని ఉన్నందున ఆమెకు తగిన రక్షణ కల్పించాలని, తగిన న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్సీ నాయకులు మత్తి జయప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

లంకూరులో పశు వైద్యశిబిరం


శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ ఫణీంద్ర

సీతానగరం: సీతానగరం పంచాయతీ పరిధిలోని లంకూరులో మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎ.ఫణీంద్ర ఆధ్వర్యంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు నట్టల నివారణ మందులు, పశు వ్యాధి చికిత్సలు, గర్భకోశ వ్యాధుల చికిత్సలు, మేకలు, గొర్రెలకు టీకాలు వేశారు. సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, జనసేన నాయకులు మట్ట వెంకటేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్ ఫణీంద్ర మాట్లాడుతూ శిబిరంలో 48 మంది రైతులకు చెందిన 72 పశువులు, 262 మేకలు, గొర్రెలకు వైద్య సేవలు అందించామన్నారు. కార్యక్రమంలో వీఏ కె.మునీంద్ర, ఏహెచ్ఎలు వై.సుధాకర్, ఎం.గీతిక, జి.వెంకటేశులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి సావిత్రీబాయి అవార్డు



సావిత్రీబాయి పూలే అవార్డు అందుకున్న ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి

కంబాలచెరువు: స్థానిక లాల్ జాజా నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న బీబీవీఎస్‌యూబీఏ లక్ష్మీదేవిని సావిత్రీబాయి పూలే జాతీయ అవార్డు వరించింది. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌పీఎల్‌టీవో) ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా ఆమె ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతామహలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.